ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.1 । కనిష్ఠం 19.8
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 23 ఫిబ్రవరి 2025



• ట్రాక్టర్లలో తరలిపోతున్న ఇసుక



• ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

• బట్టాపూర్ పెద్దవాగులో జేసీబీతో ఇసుకను తవ్వుతున్న దృశ్యం

వాగులను తోడేస్తున్నారు!

- అనుమతుల పేరిట అక్రమంగా ఇసుక తవ్వకాలు
- కప్పలవాగు, పెద్దవాగు, మంజీరాలో భారీగా తవ్వకాలు
- వేబిల్లులు పదుల్లో.. తరలిపోతోంది వందల్లో..
- వాగుల్లో జేసీబీలు వినియోగించొద్దన్న నిబంధనలకు తూట్లు
- అనుమతులకు మించి తవ్వకాలతో దెబ్బతింటున్న భూగర్భ జలాలు
- ఎత్తుపోతున్న బోర్లు.. కొత్త బోర్ల తవ్వకాలలో రైతులు
- నిద్రావస్థలో రెవెన్యూ, మైనింగ్, పోలీస్‌శాఖ అధికారులు

నిజామాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కొందరు అక్రమార్కులు వాగులను తోడేస్తున్నారు. అభివృద్ధి, అనుమతుల పేరిట ఇసుక అక్రమ దందాను సాగిస్తున్నారు. వాగుల నుంచి పెద్దఎత్తున ఇసుకను తరలిస్తున్నారు. జేసీబీలు పెట్టి పట్టపగలే ఇసుకను తోడేస్తున్నారు. తక్కువ ధర పేరుమీద వాగులలో తవ్వకాలు చేస్తూ సరఫరా చేస్తున్నారు. నిత్యం కొన్ని వాహనాలకు వేబిల్లులు తీసుకుంటూ పెద్దఎత్తున అక్రమంగా రవాణా చేపడుతున్నారు. కిందిస్థాయిలో నియంత్రించాల్సిన రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, పోలీస్, రవాణా శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రతీరోజు పెద్దఎత్తున ఈ ఇసుకను తవ్వకాలు చేస్తూ తరలిస్తున్నారు. అధికార పార్టీ నేతల అండదండలు ఉండటంతో జిల్లాలోని ప్రధానవాగుల్లో ఎక్కువ మొత్తంలో ఈ తవ్వకాలను కొనసాగిస్తున్నారు. అభివృద్ధి పనులతోపాటు సొంత ఇళ్ల నిర్మాణాలకు ఇసుక అనుమతులు ఇస్తున్న వాటి మాటున ఎక్కువ మొత్తంలో తవ్వుతూ సరఫరా చేస్తున్నారు. వాగుల్లో జేసీబీలు వినియోగించవద్దని నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో వాగుల్లో ఇసుక కనుమరుగు అవుతుండగా భూగర్భ జలాలు దెబ్బతింటున్నాయి. భారీగా ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్ల బోర్లు కూడా ఎత్తిపోతున్నాయి. రైతులు వేసిన పంటలు కూడా భూగర్భ జలాలు తగ్గడం వల్ల దెబ్బతింటున్నాయి.

• ఒకే వేబిల్లు.. పదుల సంఖ్యలో వాహనాలు

జిల్లాలోని ప్రధాన వాగుల్లో అక్రమంగా ఇసుకను తవ్వుతున్నారు. జిల్లాలోని మంజీరా, కప్పలవాగు, పెద్దవాగుతో పాటు ఇతర వాగుల్లో భారీఎత్తున ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. నిత్యం ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. అవసరం ఉన్న వారికి సైతం సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇసుక అవసరం ఉన్న వారికి టన్నుకు నిర్ణయించిన డబ్బులు కడితే తహసీల్దార్ల పరిధిలో తవ్వకాలకు అనుమతులు ఇచ్చి వేబిల్లులను అందజేస్తున్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులతోపాటు గృహనిర్మాణానికి ఈ ఇసుకను విని యోగించేందుకు అవకాశం ఇస్తున్నారు. ప్రతీరోజు కొన్ని వేబిల్లులు తీసుకుంటూ ఇసుకను జేసీబీల ద్వారా తవ్వకాలు చేస్తున్నారు. ఒకే వేబిల్లులపై ఎక్కువ మొత్తంలో వాహనాల ద్వారా తరలింపు చేస్తున్నారు. నిత్యం పట్టపగలే వాగులనుంచి తవ్వకాలు చేస్తూ ఇసుకను తరలిస్తున్నారు.

• మంజీరా వెంట మండలాల్లోని వాగుల్లోనూ..

ఏర్గట్ల, మోర్తాడ్, భీంగల్, వేల్పూర్, జక్రాన్‌పల్లి, ధర్పల్లి, డిచ్‌పల్లి పరిధిలోని వాగుల ద్వారా పెద్దఎత్తున ఈ తవ్వకాలను కొనసాగుతున్నాయి. ప్రధానంగా కప్పలవాగు, పెద్దవాగు వెంట ఎక్కువగా ఈ ఇసుక తవ్వకాలను చేస్తున్నారు. ఈ వాగులే కాకుండా మంజీరా వెంట పోతంగల్, సాలూరా, రేంజల్ మండలాల పరిధిలో కూడా తవ్వకాలను చేస్తున్నారు. అవసరాల కోసం అనుమతులు ఇస్తున్న అధికారులు వాగుల వెంట ఎంతమొత్తంలో తవ్వకాలు చేస్తున్నారో పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా సరఫరా చేస్తున్నారు. వాగుల్లో తవ్వకాలు చేస్తున్నవారు అధికారులతో ఒప్పందాలు చేసుకుంటూ మామూళ్లను అప్పచెప్పడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. కెపాసిటీకి మించి ఇసుకను వాహనాల ద్వారా తరలిస్తున్న పట్టించుకోవడం లేదు. పూర్తిస్థాయిలో వదిలివేయడంతో ప్రతీరోజు కప్పలవాగు, పెద్దవాగు పరిధిలోనే వందలాది ట్రాక్టర్ల ఇసుక తరలివెళ్తోంది. మంజీరా వెంట కూడా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఈ తవ్వకాలను చేస్తున్నారు. తక్కువ ధరకు ఇసుక అందిస్తున్నామని సాకుతో ఎక్కువ మొత్తంలో ఈ తవ్వకాలను కొనసాగిస్తున్నారు. అధికార పార్టీ నేతల అండదండలు ఉండటంతో ఎవరూ ఈ తవ్వకాలను అడ్డగించడం లేదు. ఇచ్చిన వేబిల్లుల ప్రకారం తవ్వకాలను చేస్తున్నారనే విషయాలను పట్టించుకోవడం లేదు.

• ఎత్తిపోతున్న బోర్లు.. కొత్త బోర్లకు రైతులు

కప్పలవాగు, పెద్దవాగు వెంట ఇసుక తవ్వకాలు చేపట్టడంతో భూగర్భ జలాలు భారీగా పడిపోతున్నాయి. ఈ వాగుల వెంట పలు గ్రామాల పరిధిలో ఇసుక తవ్వకాలకు గ్రామస్థులు అడ్డుకోకపోవడం, కొన్ని గ్రామాల పరిధిలో వీడీసీలు మద్దతు ఇవ్వడంతో ఇసుక దందా జోరుగా సాగుతోంది. వాగుల్లో ఇసుక ఖాళీ అవుతుండటంతో వాటివెంట ఉన్న బోర్లు కూడా ఎత్తిపోతున్నాయి. బోర్లను నమ్ముకొని వేసిన

(తరువాయి 8వ పేజీలో..)



ఎలక్ట్రిక్ వ్యర్థ పదార్థాలు కాలుస్తూ
ఆరోగ్యాలతో చెలగాటం
.... వివరాలు 7లో

యూరియాపై
ఆందోళన వద్దు
• జేడీఏ
... వివరాలు 8లో



44వ జాతీయ రహదారిపై
ట్యాంకర్ బోల్తా
.... వివరాలు 7లో

మూడు రోజులు మార్కెట్ యార్డ్‌కు సెలవు

ఖిల్లా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25వ తేదీ నుంచి 28 వరకు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు సెలవులు ఉన్నందున ఎటువంటి వ్యాపార లావాదేవాలు జరుగవని వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి అపర్ణ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈ నెల 26 బుధవారం మహా శివరాత్రి, 27న గురువారం లేబర్ హాలీడే, 28న శుక్రవారం అమావాస్య ఉన్నందున సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్ప త్తులను అమ్మకాల కోసం మార్కెట్ యార్డ్‌కు తీసుకొని రావొద్దని కోరారు. మార్చి 1న శనివారం జనరల్ బిడ్డింగ్ యథావిధిగా కొనసాగుతుందని, తిరిగి 3న సోమవారం నుంచి మార్కెట్‌లో పసు పు కొనుగోళ్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు దీన్ని గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు సాఫీగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు

• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరగనున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో సాఫీగా పోలింగ్ నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. జక్రాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వసతులను తనిఖీ చేశారు. ర్యాంప్, మరుగుదొడ్లు, విద్యుత్, నీటివసతి సదుపాయాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ



కళాశాలలోని బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నియోజకవర్గాలకు వేర్వేరుగా పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటుచేయగా వాటి క్రమసంఖ్య, ఇతర వివరాలను సక్రమంగా ఉన్నాయా లేదా క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో కిచెన్, తరగతి గదులను పరిశీలించారు. అంతకుముందు మండలంలోని మునిపల్లి గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, డైనింగ్‌హాల్, స్టోరూంలను బియ్యం నిల్వలు, కూరగాయల నాణ్యత స్టాక్‌ను పరిశీలించారు. బియ్యం బస్తాలకు ట్యాగ్ లేకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్ ఎంఎల్ఎస్ పాయింట్ ద్వారా కేటాయించబడే ప్రతీ రైతు రైస్ బ్యాగుకు ట్యాగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయ్ డీఎంకు ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులకు మెనూప్రకారం అల్పాహారం, భోజనం అందిస్తున్నారా అని కలెక్టర్ ఆరాతీశారు. కలెక్టర్‌వెంట పాఠశాల హెచ్ఎం లింగన్న, మహిళా డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.



నగరంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

అభివృద్ధి జరగాలంటే తెలంగాణలో
మార్పు రావాలి

- డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి పరుగులు
- ఉపాధ్యాయులు, నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పాలి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బోధన్‌రూరల్ / కోటగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి జరగాలంటే తెలంగాణలో మార్పు రావాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. బోధన్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాల మోసం (తరువాయి 8వ పేజీలో..)



పసుపును పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కవిత

ఎన్నికల హామీ మేరకు
పసుపునకు మద్దతు ధర ఇవ్వాలి

- క్వింటా రూ.12 వేలకు కొనాలి
- మార్కెట్‌లో తక్కువ ధర పలికితే ప్రభుత్వం బోనస్ ప్రకటించాలి
- బనకచెర్ల ప్రాజెక్టు తెలంగాణకు నష్టం
- కేంద్రానికి సీఎం లేఖలు రాసి ప్రాజెక్టును ఆపాలి: ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పసుపునకు మద్దతు ధర ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శనివారం ఆమె పార్టీ నేతలతో కలిసి నిజామాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో పసుపు రైతులతో మాట్లాడారు. పసుపుసాగు, మార్కెట్‌లో పంట విక్రయించే క్రమంలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ముందు పసుపు రైతులను ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. హామీ ప్రకారం పసుపునకు రూ.12వేల కనీస ధరను కల్పించాలని డిమాండ్ చేశారు. పసుపునకు తక్కువ ధర ఉంటే మిగతా డబ్బులను ప్రభుత్వం బోనస్ రూపంలో ఇస్తుందని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం క్వింటా పసుపునకు రూ.8వేలకు కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం బోనస్‌పై ఊసెత్తడం లేదని విమర్శించారు. సత్వరమే రైతులకు బోనస్ ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించే వరకు కేంద్రంపై పోరాటం కొనసాగిస్తామన్నారు. వచ్చే మార్చి ఒకటి లోపు పసుపు రైతులకు బోనస్ ప్రకటించకుంటే జిల్లా కలెక్టరేట్‌ను దిగ్బంధం చేస్తామని (తరువాయి 8వ పేజీలో..)

ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను
బీజేపీ మోసగించింది

• బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్ రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభు త్వం గత రెండు ఎన్నికల్లో నిరుద్యోగులకు 2కోట్ల ఉద్యోగా లు ఇస్తామని మోసంచేసిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత బీజేపీకి లేదని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏ మొఖం పెట్టుకొని బీజేపీ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎ మ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్నారని ఆయన ప్రశ్నిం చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన త ర్వాత 50వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామని, జాబ్ క్యాలెండర్‌ను సైతం విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగా లు అందిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతను మోసం చేసిన బీజేపీకి పట్టభద్రులు బుద్ధి చెప్పాలని ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. ఈనెల 24న సీఎం రేవంత్‌రెడ్డి నిజామాబాద్‌కు వస్తున్నారని ఉదయం 11 గంటలకు ఓ ఫంక్షన్‌హాల్‌లో పట్టభద్రులతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్‌ను అభివృద్ధి చేసేందుకు మహేంద్ర కంపెనీతో ఒప్పందం చేసుకొని అన్ని జి ల్లాల్లో ఐటీఐలను అభివృద్ధి చేస్తోందన్నారు. చదువుకున్న ప్రతీఒక్కరికి ఉద్యోగాలు కావాలనేది కాంగ్రెస్ ధ్యేయమని, ఆ దిశగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి రూ.30కోట్లు ఇచ్చి సీటు తెచ్చుకున్నానని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతోందని, దానిపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు జవాబు చెప్పాలని అన్నారు. ఈ విష యమై బహిరంగ చర్చకు బీజేపీ నేతలు సిద్ధమా అని సవాల్ విసిరారు. సమావేశంలో రాష్ట్రసహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కేశవేణు, గ్రంథాలయ ఛైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, ఇతర నాయకులు ఉన్నారు.



జిల్లా పరిషత్ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన



మోస్రాలో వైజ్ఞానిక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మోస్రా,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆగస్త్యా సంస్థ ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైజ్ఞానిక కేంద్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ముప్పై రకాల పలు ప్రదర్శనలను ఉపాధ్యాయులు వీక్షించి విద్యార్థుల తెలివితేటలు మెచ్చి అభినందించారు. అదే విధంగా ఆగస్త్యా సంస్థ తరఫున పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, ఆగస్త్యా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అబ్బాపూర్(ఎం)గ్రామ సందర్శన



చిరుతపులి అడుగులను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

నవీపేట,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బాపూర్(ఎం)గ్రామాన్ని శనివారం సాయంత్రం అటవీశాఖ అధికారులు సందర్శించారు. గురువారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన బెల్లి అబ్బయ్య అనే రైతుకు చెందిన రెండు లేగదూడలను చిరుత పులి దాడి చేసి చంపి వేసిన విషయం విదితమే. దీంతో అటవీశాఖ అధికారులు చిరుతపులి జాడను కనిపెట్టడానికి గ్రామాన్ని సందర్శించారు. చిరుత పులిని బంధించడానికి గ్రామ శివారులో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు త్వరలో బోనును ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ జహుర్, బీట్ ఆఫీసర్ సుధీర్, సిబ్బంది ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వాహకులు, విద్యా ర్థులకు మెను ప్రకారంగా భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూ చించారు. శనివారం పట్టణంలోని రాజారాంనగర్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో రుచికరమైన భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. విద్యార్థులకు కనబడేలా మెనును ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు.

సైబర్‌నేరాల నియంత్రణపై అవగాహన

నవీపేట,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్‌లో శనివారం సైబర్ నేరాల నియంత్రణపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఫోన్ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు మహేష్, భాస్కర్, గ్రామస్థులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంపీవో

వేల్పూర్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం తీరును శనివారం ఎంపీవో సాయిలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వండే వంట పాత్రాలను, కూరగాయలను పరిశీలించారు. వంటకాలకు సంబంధించి వస్తువులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతూ రుచికరమైన వంటలను విద్యార్థులకు అందించాలని సూచించారు. ప్రభుత్వ మెను ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు.

బట్టాపూర్‌లో ఆరు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్



పోలీస్‌స్టేషన్ వద్ద సీజ్ చేసిన ట్రాక్టర్లు

ఏర్గట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బట్టాపూర్ గ్రామంలో శనివారం అక్రమంగా తీసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను ఒక జేసీబీని పోలీస్‌లు సీజ్ చేశారు. ఈ విషయమై స్థానిక ఎస్సై బీ.రామును వివరణ కోరగా బట్టాపూర్ గ్రామ శివారులో ఎలాంటి వేబిల్ లేకుండా ఉన్న ఇసుక ట్రాక్టర్‌లను పెద్దవాగు సమీపంలో ఒక జేసీబీని గుర్తించి సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

శివరాత్రికి వేములవాడకు ప్రత్యేక బస్సు సౌకర్యం

పెర్కిట్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారు శివరాత్రికి వేములవాడకు ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసిందని ఆర్మూర్ డిపో మేనేజర్ పి.రవికుమార్ తెలిపారు. ఆర్మూర్ నుంచి వేములవాడకు ఈనెల 25, 26, 27తేదీలలో ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ఈ బస్సులలో మహాలక్ష్మీపథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కలదని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం సుఖవంతమైన సుభ్రపదమైన ప్రయాణాన్ని చేయాలని తెలిపారు.

స్టీల్ ప్లేట్ల వితరణ

పెర్కిట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జంబి హన్మాన్ ఆలయ ప్రాంగణంలో ప్రతీ శనివారం నిర్వహించే అన్నప్రసాద కార్యక్రమానికి ఆలయకమిటీ డైరెక్టర్ దొండి రమణ స్టీల్ ప్లేట్లను వితరణ చేశారు. జంబిహన్మాన్ ఆలయానికి స్థానిక భక్తులే కాకుండా ఇరుపక్కల ప్రాంతాల వారు మెట్‌పల్లి, కోరుట్ల, నందిపేట, డిచ్‌పల్లి నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శనం చేసుకుంటున్నారు. అదే విధంగా ప్రతీ శనివారం ఆలయంలో అందించే అన్నప్రసాదాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్టీల్ ప్లేట్ల కొరత ఏర్పడడంతో అన్నప్రసాద కార్యక్రమానికి స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశామని తెలిపారు. శనివారం నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ డైరెక్టర్‌గా నియమించినందుకు గాను ఆర్మూర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డికి దొండి రమణ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, గోపిగౌడ్, నారాయణరెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే ప్రశాంత్ ఆరోపణలు అర్థరహితం'



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 22:(ఆంధ్రజ్యోతి) పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పసుపు రైతులను మోసం చేసింది. సకాలంలో రుణమాఫీ చేయకుండా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అందించని కారణంగా 12 వంద మంది రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నది. కేసీఆర్ పాలనలో కాదా వాటిని కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అసత్య ఆరోపణలకు దిగుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి బాసవేణుగోపాల్ యాదవ్ విమర్శించారు. ప్రజానిలయంలో శనివారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పసుపు ధర క్వింటాలుకు రూ.5 వేలే దాటలేదని పసుపు రైతులకు కటఫ్‌రేట్ పెట్టకుండా రైతులను నట్టేట ముంచింది మీరుకాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో పుసుపు రైతులను ఆదుకోవాలన్న తపనతో రేవంత్ రెడ్డి క్వింటాలు కొమ్ములకు రూ.10వేలు తగ్గకుండా తగు నిర్ణయాలు తీసుకున్నారని, మండకు కటఫ్ రేట్ రూ.9వేలు ధర తగ్గకుండా పసుపు రైతులవు ఆదుకునే నిమిత్తం చర్యలు తీసుకుంటే మరో పక్క సీఎం రేవంత్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు గుప్పించడం సరకాదన్నారు ఇప్పటికైనా అసత్య ఆరోపణలకు స్వస్తి పలకాలని హితవుపలికారు. సమావేశంలో కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, దేవారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, రాజా ముత్యం, పల్లె శేఖర్, చరణ్ ముదిరాజ్, కుందారపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం రిజిస్టర్ కోసం కార్యాచరణ

నవీపేట,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామంలో ఉన్న ఎర్రకుంట రిజర్వాయర్‌లో నూతనంగా మత్స్యకారుల కోరిక మేరకు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం రిజిస్టర్ చేయడానికి తగిన కార్యాచరణ చేపట్టడం జరిగిందని జిల్లా మత్స్యశాఖ అధికారి అంజనేయ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అబ్బాపూర్(ఎం), అభంగపట్నం గ్రామాల మధ్యన ఉన్న సుమారు 4, 5 చెరువులను కలిసి 2016సంవత్సరంలో ఎర్రకుంట రిజర్వాయర్‌గా నిర్మించబడిందని ఆయన పేర్కొన్నారు. ఈ రిజర్వాయర్ అబ్బాపూర్(ఎం)కు చెందిన సుమారు 300ఎకరాలు, అభంగపట్నంకు చెందిన 90ఎకరాల వరకు విస్తరించి ఉందని ఆయన పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు అబ్బాపూర్(ఎం) గ్రామంలో 404, అభంగపట్నంకు చెందిన 10 గూండ్ల, గంగపుత్ర కులానికి చెందిన మత్స్యకారులు ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో చేపల పట్టివేతపై ఆధారపడిజీవిస్తున్నారని అన్నారు. మైనర్ ఇరిగేషన్ కేటగిరికి చెందిన ఈ నీటి వనరులపై ఆధారపడి బ్రతకడానికి రెండు గ్రామాల్లో ఉన్న మత్స్యకారులతో గతంలో ఉన్న సహకార సంఘం 2022లో రద్దు అయిందని ఆయన పేర్కొన్నారు. నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేయడానికి మత్స్యకారుల నుంచి దరఖాస్తులు కోరడం జరుగుతుందని అబ్బాపూర్(ఎం), అభంగపట్నం గ్రామాలలో చేపల వేట వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

నానో యూరియా పర్యావరణ పర్యవేక్షణకు తోడ్పడుతోంది

వేల్పూర్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి):నానో యూరియా పర్యావరణ పరిరక్షణ ఎంతగానో తోడ్పడుతుందని, శనివారం వేల్పూర్ తీగెల బాల్‌రెడ్డి రైతు వ్యవసాయ క్షేత్రంలో యాల్ల ప్రవీన్‌కు చెందిన డ్రోన్ సహాయంతో నానో యూరియ వాడకంపైన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శృతి మాట్లాడుతూ నానో యూరియాను పంట ఆకులపైన పిచికారి చేయడం వల్ల నత్రజని సోషణ ఎక్కువగా ఉండి పంట మెరుగైన పెరుగుదల, ధాన్యం ఉత్పత్తి, పంట నాణ్యతకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానోయూరియా ఘనపరిణమం అతితక్కువగా ఉండి ఎక్కువ ఉపరితల వైశాల్యం కలిగి ఉంటుందన్నారు. దాని వల్ల యూరియాక ణాలు పంటకు సులభంగా అందుబాటులో ఉంటాయన్నారు. సాంప్రదాయ యూరియతో పోలిస్తే దీని వాడకం వల్ల ఏలాంటి పర్యవరణ కలుష్యం ఉండ దన్నారు. వాతావరణ మార్పులకు కారణమయ్యే వ్యవసాయ క్షేత్రాల నుంచి వచ్చే బ్లీచింగ్, వాయు ద్వారా రూపంలో పోషక నష్టాన్ని తగ్గించడం జరుగు తుందన్నారు. నానో యూరియా వాడకం వల్ల పంట దిగుబడి ఎనిమిది శాతం పెరుగుతుందన్నారు.సాంప్రదాయ యూరియా 45కిలోల బస్తా ధర రూ.268లు కాగా 500మిల్లీలీటర్ల నానో యూరియా బాటిల్ ధర కేవలం రూ. 225మాత్రమే ఉంటుందన్నారు. నానో యూరియా బాటిల్ సమర్థవంతంగా భర్తీ చేస్తుందని దీని వాడకాన్ని రైతులు అలవాటు చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెల్స్‌మెన్ సతీష్, రైతులు గంగారెడ్డి, బాల్ రెడ్డి, యాల్ల ప్రవీన్, తదితరులు ఉన్నారు.



వేల్పూర్‌లో డ్రోన్‌తో పిచికారి చేస్తున్న అధికారులు

కుంభమేళా నుంచి వస్తుండగా రోడ్డు ప్రమాదం

- 12మంది శివస్వాములకు తీవ్రగాయాలు
- హైదరాబాద్, నిజామాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స
- క్షతగాత్రులు యాదాద్రి జిల్లా వాసులు

మెండోర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కుంభమేళా నుంచి తిరిగి వస్తుండగా 12 మంది శివస్వాములు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మెండోర మండలం బుస్సాపూర్ 44వ జాతీయరహదారిపై శనివారం వేకువజామున జరిగిందని ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల పరకారం యాదాద్రి జిల్లా చాడ గ్రామానికి చెందిన శివస్వాములు ప్రయాణిస్తున్న వాహనం కుంభమేళా వెళ్ళి తిరుగు ప్రయాణంలో బుస్సాపూర్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. వీరి వాహనం ముందు టమాటల లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనం డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల డివైడర్‌కు ఢీకొట్టింది. వెనకాల ఉన్న శివస్వాములు వాహనం ముందు ఉన్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టడంతో వాహనంలో ఉన్న స్వాములకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడ్డ వారిని హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ శివస్వాములు

మంచి నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): పట్టణానికి మంచినీటి సరఫరా అయ్యే మంచినీటి శుద్ధి కేంద్రాన్ని శనివారం మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. రాబో యే వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్తచర్యగా బాల్కొండ మం డల కేంద్రంలో ఉన్న మంచినీటి శుద్ధి కేంద్రాన్ని మరమ్మతులను చేయించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ భూమేశ్వర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విద్యాసంస్థలను రద్దు చేయాలి

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):విద్యార్థుల వరుస ఆత్మహత్యలకు కారణమవుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థలను రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు శనివారం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ సంవత్సరం వందలాది మంది విద్యార్థులు శ్రీచైతన్య విద్యాసంస్థల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని శుక్రవారం ఖమ్మంలో శ్రీచైతన్య విద్యా సంస్థలో చదువుతున్న యోగనందిని అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని ఈ ఆత్మహత్యకు ఆకరణమైన వారిని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి 50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. అనుమతులు లేకుండా వందల సంఖ్యలో నిర్వహిస్తున్న శ్రీచైతన్య బ్రాంచ్‌లను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రిన్స్, నిఖిల్, విజయ్ పాల్గొన్నారు.

'ప్రముఖుల చరిత్ర చదవాలి'

మోస్రా,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామంలో నలంద విద్యానిలయం పాఠశాలలో నగర్వంగా అత్యంత విజయవంతమైన పాజిటీవ్ పేరేంటింగ్ సెషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ తిరునగరి శ్రీహరి, మాదం మహిపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం, వివేకానంద జీవితాల గురించి వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు గుత్ప లక్ష్మారెడ్డి, రేఖ లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సహకార సంఘం నష్టాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

● ఎత్తొండ సంఘ సభ్యుల డిమాండ్

కోటగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘంలో జరిగిన నష్టాలపై సమగ్ర విచారణ జరపాలని ఎత్తొండ మాజీ అధ్యక్షులు అశోక్ పటేల్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో శనివారం సంఘ సభ్యులతో కలిసి విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం 2017-18 నాటికి సుమారు 7.50 కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. అదే సమయానికి సుమారు కోటి 16 లక్షల రూపాలయల నష్టాల్లో ఉందన్నారు. 2013-14 లో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తమ సిబ్బంది మీద ధాన్యం కొనుగోలు చేసినట్లు ట్రాక్‌షీట్ రాసినట్లు ఉందన్నారు. ఈ విలువ సుమారు 74 లక్షలు సిబ్బంది ఖాతాలో జమచేసి ఆ మొత్తాన్ని ఎటు మళ్లించారో తెలియదన్నారు. 2018 వరకు కొనసాగిన పాలకవర్గాన్ని రద్దుచేసి పాలకవర్గ బాధ్యతలు అధికారులకు అప్పగించారని వారు అన్నారు. తమ పాలకవర్గం బాధ్యతలు తీసుకునే సమయానికి సంఘంలో కేవలం 2.50 కోట్ల ధాన్యం నిలువ ఉన్నట్లు తమ దగ్గర ఆధారాలు ఉన్నాయన్నారు. తడిసిన ధాన్యం మిల్లింగ్ చేసి సివిల్ సప్లైకి పంపించామన్నారు. గత పాలక వర్గం చేసిన అప్పులను వడ్డీతో సహా చెల్లిస్తూ వచ్చామని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యు లు లింగయ్య, శ్రీనివాసరావు, గంగాధర్, పోశెట్టి ఉన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

మోర్తాడ్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్‌పల్లి గ్రామానికి చెందిన పండ్లబీమన్న(55) అనే వ్యక్తి చెరువులో స్నానానికి వెళ్ళి ప్రమాదవశాత్తు మతి చెందాడని ఎస్సై విక్రం తెలిపారు. కూలీ పని చేసుకునే బీమన్న స్నానం చేయడానికి వెళ్ళి చనిపోయాడని ఆయన తమ్ముడు రాజన్న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి

ఎడపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎడపల్లి ఎం పీవో మన్మోహన్ శర్మ పేర్కొన్నారు. శనివారం జానకంపేట, ఎడపల్లి గ్రామాలలో పన్నుల వసూళ్ల కోసం పంచాయతీ కార్యదర్శులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగింపులోగా వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ ఇంటి పన్నులు చెల్లించాలని కోరారు. పన్నుల చెల్లింపుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమనారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రేమ్‌కుమార్, ఉదయ్ భాస్కర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల అందజేత

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విపి ఉన్నతన్ ఫౌండేషన్ ఫౌండర్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు స్టడీ చైర్‌లను దాత విపి ఉన్నతన్ ఫౌండేషన్ ఫౌండర్ ఎన్ఆర్ఐ ఆనందవల్లి అందజేశారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు క్రీడా దుస్తులతో పాటు రూ.45వేల క్రీడా సామాగ్రిని, రూ.21వేల విలువ గల 25స్టడీ చైర్‌లను ఆనందవల్లి పాఠశాల విద్యార్థులకు అందజేశారు. వచ్చే విద్యసం వత్సరానికి గాను గణితశాస్త్ర ల్యాబ్‌కు అవసరమైన పరికరాలను అందజే స్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గంగజమున, పీఆర్‌టీయు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అశోక్, మండల అధ్యక్షుడు గోపి, ప్రధానకార్యదర్శి రవీన్, వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్ పాల్గొన్నారు.

'నిరంతరంగా విద్యుత్తు సరఫరా'

ఎడపల్లి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం బోధన్ డివిజన్ విద్యుత్ డీఈ ముక్తార్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి కాలంలో ప్రజలకు ఇబ్బందులు కాకుండా నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, ఏఈ కిషోర్ రెడ్డి, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ లైన్‌మెన్ పవన్ కుమార్. జూనియర్ లైన్‌మెన్ లక్ష్మన్, హన్మాండ్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

కోటగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : కోటగిరి మండలంలోని వల్లభాపూర్ గ్రామంలో శనివారం ఇసుక లారీలను గ్రామస్థులు అడ్డుకున్నారు. సాలూర మండలం మందర్న ఇసుక క్వారీ నుండి ఇసుక ఓవర్ లోడ్‌తో వల్లభాపూర్ మీదుగా వెళుతుండడంతో ఇంట్లోకి దుమ్ము, ధూళి చేరి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గత వారం రోజుల నుంచి ఇళ్ళలోకి దుమ్ము, ధూళి చేరి అనారోగ్యాల పాలవుతున్నామని వాపోయారు. రోడ్డుపై నీళ్ళు చల్లి దుమ్ము, ధూళి రాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ వాటర్ ట్యాంకర్‌తో నీళ్ళు చల్లడంతో గ్రామస్థులు శాంతించారు.

నేడు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గురుకుల ప్రవేశ పరీక్ష 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు నేడు ధర్మారం గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవి లత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9గంటల లోపు కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టికెట్, బ్లూ,బ్లాక్, పరీక్ష ప్యాడు లను వెంట తెచ్చుకోవాలని ఆమె సూచించారు. హాల్ టికెట్ లో తప్పులు ఉంటే విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల బోనాఫైడ్ లేదా ఆధార్ కార్డు పరీక్ష కేంద్రంలో చూయించాలని తెలిపారు

పదో తరగతి విద్యార్థులకు టీ శాట్ ద్వారా అవగాహన

● విద్యాశాఖ వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఆర్‌జేడీ



టీ శాట్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌జేడీ

ముప్కాల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి):బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో టీ శాట్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు విద్యశాఖ వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఆర్‌జేడీ ద్వారా విద్యార్థులకు పదవ తరగతిలో ఎలాంటి ఒత్తిడి లేకుండా ధైర్యంగా పరీక్షలు ఎలా ఎదుర్కొవాలో ఆయన వివరించారు. విద్యశాఖ సెక్రెటరీ యోగితారాణా విద్యార్థులకు ప్రత్యేక సందేశాన్ని ఇచ్చారు. పదో తరగతిలో వందకు వంద శాతం వచ్చే విధంగా సబ్జెక్టు వారిగా విశ్లేషకులు వారికి అవగాహన కల్పించారు. పరీక్షలలో ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా, ఆనందంగా పరీక్షలు రాయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ హెచ్‌ఎం ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల భద్రతపై రైతులకు అవగాహన



ఆలూర్ పొలంబాటలో మాట్లాడుతున్న డీఈ రమేష్

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ టెక్నికల్ రమేష్ మాట్లాడుతూ వ్యవసాయ మోటార్ల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు, రైతులు స్విచ్‌బోర్డు, మోటర్ స్టార్టర్‌ల వద్ద భద్రత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల గద్దెల ఎత్తుపెంచుతామన్నారు. హర్వెస్టర్‌ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశమున్న ప్రదేశాలతో పాటు తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్‌లను సరి చేస్తున్నామన్నారు. దీని వల్ల ప్రమాదాలను నివారించగలుగుతామన్నారు. రైతులకు మరింత నాణ్యమైన సేవలందించడానికి సంస్థ కృషి చేస్తుందన్నారు.ఈకార్యక్రమంలో ఏఈవో శ్రావణ్‌కుమార్, లైన్‌మెన్‌లు గంగాధర్, రమేష్, సత్యనారాయణ, నరేష్, రైతులు విజయ్, పురుషోత్తం, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముత్యాల సునీల్

ఏర్గట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జితేందర్ నరేందర్ వాళ్ల తండ్రి నరేందర్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా శనివారం బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాలె శ్రీనివాస్, గొల్కొండ మల్లేష్‌లు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో డ్రైవింగ్ స్కూల్ ప్రారంభం

మోర్తాడ్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డ్రైవింగ్ స్కూల్‌ను శనివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు డ్రైవింగ్ స్కూల్ ద్వారా నేర్చుకొని డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని అన్నారు. డ్రైవింగ్ స్కూల్ యజమాని నజీర్ గతంలో 410 మందికి శిక్షణ ఇచ్చిన అనుభవంఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, నజీర్, పుప్పాల అశోక్, హర్షద్, గిర్మాజీ గంగాధర్, పుప్పాల అశోక్, జక్కం అశోక్, పాషా, మహిపాల్, సతీష్, జైడి చిన్న గంగారాం, గురువయ్య, షదీక్, తదితరులు పాల్గొన్నారు.



డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించిన దృశ్యం

వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వైవేణుప్రసాద్ తెలిపారు. శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ డబ్ల్యుఈసీ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, మెనిస్ట్రావ్ హైజిన్ అనే అంశంపై అవగాహన కల్పించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ అలేఖ్య, వైస్‌ప్రిన్సిపాల్ ఎం.సునీత, వజ్రభాను, అధ్యాపకులు,పాల్గొన్నారు.

నవీపేటలో బైక్ చోరీ

నవీపేట,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం రెంజల్ మండలం దూపల్లికి చెందిన జిన్న సాయిలుకు చెందిన బైక్ చోరీకి గురైంది. వారంతపు సంతకు వచ్చిన ఆయన తనపై బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి ఉంచి సంతకు వెళ్లగా తిరిగి వచ్చే సరికి బైక్ మాయమైంది. తన హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్ చోరీ విషయంపై నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని బాధితుడు పేర్కొన్నారు.

చెత్తను మున్సిపల్ ట్రాక్టర్‌కు అందించాలి



మహిళలకు తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో రోడ్లపై చెత్త పరవేయకుండా ప్రతీఒక్కరు మున్సిపల్ ట్రాక్టర్‌కు అందించాలని మున్సిపల్ సానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్ ప్రజలను కోరారు. శనివారం పట్టణంలోని 13వార్డులో మహిళలకు., అలాగే ప్రజ్ఞ హైస్కూల్‌లో విద్యార్థులకు తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఇంట్లోనే తడిపొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ ట్రాక్టర్‌కు అందించాలన్నారు. అలాగే వీదికుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్ నర్సయ్య, మెప్మా సీవో రాజలింగం, ఆర్‌పీ సత్య, తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

● శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ధర్పల్లి



ఆంధ్రజ్యోతి: గ్రామంలో రాబోయే వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారణకు ఏ చర్యలు తీసుకుంటున్నారు?

కార్యదర్శి: ప్రతీరోజు గ్రామంలో ఉదయం, సాయంత్రం నల్లాల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నీటి ఎద్దటి ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామంలో పారిశుధ్యలోపంపై గ్రామస్తుల నుంచి విమర్శలు వస్తున్నాయి కదా?

కార్యదర్శి: సఫాయి కార్మికుల కొరత ఉంది. అయినప్పటికీ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రతీరోజు నిర్వహిస్తున్నాం. సాధ్యమైనంత వరకు పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇంటి పన్ను బకాయి వసూలు ఏ విధంగా ఉన్నాయి?

కార్యదర్శి: గ్రామంలో 35లక్షల మేర ప్రతియేటా ఇంటి పన్ను రూపంలో గ్రామ పంచాయతీకి సమకూరనుంది. మార్చి లోపు గ్రామస్తులు తమ తమ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి.

ఆంధ్రజ్యోతి: గ్రామంలో ఉపాధి హామీ కింద ఏ పనులు చేపడుతున్నారు?

కార్యదర్శి: గ్రామంలో 1300లకు పైగా జాబ్ కార్డులు కలిగిన కూలీలు ఉన్నారు. కూలీల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయంతో కూలీల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేస్తున్నారా?

కార్యదర్శి: ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల సూచనల మేరకు క్రమం తప్పకుండా వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేస్తున్నాం. నీటి ఎద్దడి ప్రాంతాల్లో రాబోయే రోజుల్లో వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసి గ్రామస్తులకు ఎలాంటి నీటి కొరత లేకుండా చూస్తాం. గ్రామస్తులు గ్రామ పంచాయతీ సిబ్బందికి సహకరించాలి.

●(ఆంధ్రజ్యోతి, ధర్పల్లి)

ఆంధ్రజ్యోతి పరిశీలన



మామిడిపల్లిలో స్కూల్ పక్కన, నివాసాల మధ్య ఎలక్ట్రిక్ వ్యర్థాలను కాల్చివేస్తున్న దృశ్యం



స్కూల్ పక్కనే పాత సామాగ్రి డంప్ చేస్తున్న దృశ్యం

ఎలక్ట్రిక్ వ్యర్థాలు కాలుస్తూ

ఆరోగ్యాలతో చెలగాటం

పెర్కిట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని విలీన గ్రామాలు మామిడిపల్లి, పెర్కిట్ సమీపంలో గల విజయ్ ఫైనాన్స్ గ్రౌండ్ పక్కన పాత సామగ్రి డంప్‌ను కొందరు వ్యక్తులు ఏర్పాటు చేశారు. ఈ డంప్‌లో ఎలక్ట్రిక్ వస్తువులు ఇతర పాడైపోయిన, విరిగిపోయి నిరుపయోగ వస్తువులు సేకరించి ఈ స్థలంలో డంప్ చేస్తారు. అందులో కొన్ని పాడైపోయిన కూలర్లు, ఎలక్ట్రిక్ వస్తువులు రాత్రి సమయంలో కాల్చివేస్తున్నారు. కాల్చడం వల్ల ఈ మంటల నుంచి దట్టమైన పొగలు రావడంతో చుట్టు పక్కల ప్రాంతాల నివాస సముదాయాలోని ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపిల్లలు దగ్గు, దమ్ముతో బాధ పడుతున్నారు. ఎలక్ట్రిక్ కాల్చడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, వెంటనే డంప్ చేసిన సామాగ్రిని ఏ నిర్మానుష్య ప్రాంతాలకు తరలించాలని నిర్వాహకులకు ప్రజలు కోరగా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో మున్సిపల్ అధికారులకు తెలిపిన నామ మాత్రంగా మున్సిపల్ జవాన్లు పంపి వదిలేశారు. కానీ డంప్ నిర్వాహకుడు ప్రతీ రోజు రాత్రి వేళల్లో ఎలక్ట్రిక్ వ్యర్థాలను కాల్చు తూనే ఉన్నారు. అందువల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతు న్నా రు. అధికారులు, స్థానిక నాయకులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్న పిల్లలకు శ్వాసకోస వ్యాధి వచ్చే అవకాశం ఉంది

● రాకేష్, స్థానికుడు, ఆర్మూర్

పాత ఎలక్ట్రిక వ్యర్థాలు, కూలర్‌లు వంటి నిరుపయోగ వస్తువులు రాత్రి సమయంలో కాల్చుతున్నారు. వాటి నుంచి దట్టమైన పోగలు వ్యాప్తి చెందిన చిన్నారులకు ఇది వరకే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి అనారోగ్య సమస్యలు ఎదురయ్యాయి. చిన్న పిల్లలు పలుమార్లు జబ్బుల భారిన పడ్డారు. అధికారుల దృష్టికీ తీసుకువెళ్లిన ఎలాంటి చర్యలు తీసు కోలేదు. డంప్ చేసిన నిర్వాహకులు ఓ ప్రజాప్రతినిధికి దగ్గర బంధువుగా చెబుకుంటు వెళ్ళిన వారిపై దుర్భాషలాడారు. వెంటనే అధికారులు స్పందించి డంప్ చేసిన వస్తువులను తొలగింపజేయాలని కోరుతున్నాం.



ఏకచక్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బోధన్ ఏకచక్రేశ్వర శివాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 26న మహ శివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నేటి నుండి 27వ తేదీ వరకు కొనసాగుతాయని శివాలయం కమిటీ చైర్మన్ హరి కాంత్ చారి పేర్కొన్నారు. వేద పండితులు గణేష్ మహరాజ్ మంత్రోచ్చరణల మధ్య గణపతి పూజ, మహన్యాస పూర్వక లఘు రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు గణేష్ మహరాజ్ మాట్లాడుతూ శివ నామస్మరణతో సకల శుభాలు కలుగుతాయని, బోధన్ ఏకచక్రేశ్వర శివాలయం చరిత్రను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సింగం లక్ష్మణ్, కమల భూమేష్, కవిత, సంజీవ్ కుమార్, సూర లింగం, నాగేష్, దేవాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి ఎస్.రాములు, వేద పండితులు మహేష్ పాఠక్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఏకచక్రేశ్వర శివాలయంలో బ్రహ్మోత్సవాల దృశ్యం

తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని కొండపై చుట్టు ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



తొర్లికొండ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అధ్వానంగా మారిన బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారి

● దారుణంగా ఉన్న రోడ్డుకు మరమ్మతు చేయని దుస్థితి ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



అధ్వానంగా మారిన ఇసన్నపల్లి గ్రామం మీదుగా మద్దికుంట గ్రామానికి వెళ్లే రోడ్డు



ధ్వంసమైన ఇసన్నపల్లి - మద్దికుంట వెళ్లే రోడ్డు

రామారెడ్డి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం నుండి ఇసనపల్లి గ్రామం మీదుగా బీటీ రోడ్డుపై మద్దిగుంట అడవి ప్రాంతంలో వెలిసిన బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈనెల 26న బుధవారం మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని స్వయంభు బుగ్గ రామ లింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు లక్షకు పైగా సంఖ్యలో తరలివెళ్తారు. రో డ్డు చెడిపోవడంతో ఎలాంటి ప్రమాదాలు గురవుతాయని ప్రజలు బాధ పడుతున్నారు. చెడిపోయిన రోడ్డును మరమ్మతులు పనులు చేయక పోవడం ప్రజాప్రతిని నిర్లక్ష్యమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, పై అధికారులు స్పందించి తగిన మెరుగైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అంక్సాపూర్ హన్మాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

వేల్పూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హన్మాన్ ఆలయంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం దాసంజనేయ నవగ్రహ శివ పంచయతన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా 23న (ఆదివారం) రోజున హంపి వీరూపాక్ష విద్యారణ్య భారతిస్వామి శ్రీ జగద్గురు శంకరచార్యులు కరకములచే విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నారు. అందు కోసం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం గణపతిపూజ, స్థాపిత దేవత హోమం, అంతకు ముందు గ్రామంలోని ప్రధాన వీదులగుండా విగ్రహాల ఊరేగింపు, పుణ్య హవచనం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠా, గణపతి హోమం, విగ్రహ జలాధివాసం, హారతి, తీర్థప్రసాద వితరణ, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు పురోహితులు అవధాని సుదీర్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

రామారెడ్డి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన పోతుల బాపు రెడ్డి కుమారుడు దయాకర్ రెడ్డి అన్నదానం కోసం రూ. 11116 (పదకొండు వేల ఒక వంద పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు. శనివారం ఆలయానికి చేరుకుని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ నారెడ్డి మహిపాల్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి రాజకీయ నాయకులు, వైద్యులు, వ్యాపారులు కృషి చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి వివరించారు.

భక్తి



శివపార్వతులతో పాటు ఇతర విగ్రహాల ఏర్పాటుకు తీసుకువచ్చిన దృశ్యం



● బిచ్కుందలో ముమ్మరంగా సాగుతున్న కైలాస పర్వతం సెట్టింగ్ ఏర్పాట్లు



శివపార్వతుల కల్యాణానికి ఏర్పాట్లు

బిచ్కుంద, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి రోజు శివపార్వతుల కళ్యాణమహోత్సవం నిర్వహించేందుకు స ద్గురు బండాయప్ప మఠాధిపతి సో మలింగ శివచార్య మహాస్వామిజీ కైలాస పర్వతం భారీ సెట్టింగ్‌లను ఏర్పాట్లు చేస్తున్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన మఠసంస్థాన్‌కు మ హారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొననున్నా రు. శివరాత్రికి మూడు రోజుల ముందుకు తర్వాత మూడురోజుల పాటు మఠ సంస్థాన్ ప్రాంగణమంతా సందడి నెలకొంటుంది. మహాశివరాత్రి లింగోద్భవం సందర్భంగా స్టేజిపై 25 అడుగుల పరమశివుని ప్రతిమను ప్రతిష్ఠించి స్టేజికి ఇరువైపులా గజరాజులు స ర్వేశ్వరుడైన శివపార్వతుల కుటుంబసమేత ప్రతి ఏర్పాటుచేస్తున్నారు. సద్గురు బండాయప్ప మఠసంస్థానం, కాశీ విశ్వనాథ్ శివాలయ ప్రాంగణ ఆవరణ మొత్తం విద్యుత్ కాంతులతో పాటు శివపార్వతుల కళ్యాణ మహోత్సవ సెట్టింగ్‌కు దాదాపు 25 లక్షల వ్యయంతో అంగరంగ వైభవంగా భక్తులందరికి కనుల పండుగ నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లలో మఠాధిపతి నిర్వహకులు సిబ్బంది నిమగ్నమయ్యారు. మహాశివరాత్రి ఉత్సవ వేడుకలలో భక్తులందరూ పాలాభిషేకం చేసే సౌకర్యం కల్పించడం జరుగుతుందని భక్తులందరూ ఈ మహోత్సవ వేడుకలలో పాల్గొని శివపార్వతుల దివ్యఆశీస్సులు పొందాలని మఠాధిపతి నిర్వహకులు తెలిపారు.

శివనామస్మరణతో మార్మోగనున్న దోమకొండ

● ఉత్సవాలకు హాజరుకానున్న పెద్దఎత్తున భక్తులు ● భక్తుల సౌకార్యార్థం అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ

దోమకొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దోమకొండ మండల కేంద్రం భక్తుల శివనామస్మరణతో మర్మోగనుంది. శివ రాంమందిర్ ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు అభిషేకాలు ఎదురుకోల్లు, గంగాన్నపూరణ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం, అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు రాత్రి నిశిపూజ, దిష్టికుంభాలు, స్వామివారి రథారోహణ, గంగన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, సీతారామచంద్ర స్వామివార్లను రథలపై ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు ఉమ్మడి నిజామాబాద్, మెదక్, కరీంనగర్, హైద్రాబాద్, ఉమ్మడి జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని ముంబాయి. నాందేడ్ నుంచి భక్తులు భారీగా రానున్నారు. కామీనేని వంశస్థులైన అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాసనతో పాటు హీరో రాంచరణ్ కుటుంబ సభ్యులు గడికోటలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం కోటలో హైదరాబాద్ నుంచి వచ్చిన కళాకారులు, కవులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు దోమకొండకు చెందిన ఆయా పాఠశాల విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వీక్షించిన అనంతరం రథాలు, ప్రయాణ ప్రాంగణం ఆవరణలోకి చేరుకుంటాయి. భక్తులు అక్కడికి చేరుకుని లంకదహనం కార్యక్రమాన్ని వీక్షించి అనంతరం ఉపవాసాలతో వచ్చిన భక్తులు శివనామస్మరణతో మొక్కులు తీర్చుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీతో పాటు దోమకొండ, బీబీపేట భిక్కనూర్ పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహిస్తారు. చక్కెర తీర్థం వరకు దోమకొండ శివనామస్మరణతో మర్మోగనుంది.



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

● ఎలా వెళ్లాలి

కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి దోమకొండ 18 కిలోమీటర్లు దూరం ఉంటుంది. భక్తుల సౌకార్యర్థం ఆర్టీసీ అధికారులు కామారెడ్డి నుంచి దోమకొండకు ప్రత్యేక బస్సులు నడుపుతారు. 30 నిమిషాల సమయంలో దోమకొండకు చేరుకోవచ్చు. బస్టాండ్ నుంచి శివరాం మందిర్ ఆలయం, గడికోట దగ్గరలోనే ఉంటుంది.

భక్తులకు అన్ని వసతులు కల్పించాం

● కొండ అంజం, ఆలయ కమిటీ చైర్మన్

శివరాం మందిర్ ఆలయంలో భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేశాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, పోలీస్, ఆర్టీసీ అధికారుల సమన్వయంతో పూర్తి వసతులు కల్పించాం. రథాలు ప్రయాణ ప్రాగణం లంకదహనం కార్యక్రమం వరకు భక్తులకు ఇబ్బందుల్లేకుండా జగ్రాత్తలు తీసుకున్నాం.

● నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

23 నుంచి 27 వరకు శివరాత్రి బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొండ అంజం తెలిపారు. 23న ఉదయం నుంచి ప్రదోశ పూజ, గణపతి పూజ, పుణ్యవహచనము, ఆఖండ దీపారదన, 24న ఉదయం నుంచి ప్రాతకాలపూజ, మాతృకా, యోగిని, వాస్తు క్షేతపాలక, అగ్నిప్రతిష్ఠ, 25న స్థాపిత దేవత హవణము, పూజలు, శేషశాయిపై స్వామివారి ఊరేగింపు, 26న భక్తుల అభిషేకాలు, ఎదురుకోల్లు, గంగాన్నపూర్ణ సమేత, విశ్వేశ్వర స్వామివారి కల్యాణోత్సవం అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు, రాత్రి 1.10 నిమిషాలకు నిషిపూజ, దిష్టికుంభాలు, స్వామివారి రథారోహణ, గంగాన్నపూర్ణ సమేత, విశ్వేశ్వర స్వామి, సీతారామచంద్రస్వామి వార్ల రథములపై స్థానిక ప్రయాణ ప్రాంగణం వద్దకు బయలుదేరుట, లంకదహనం అనంతరం రథాలు ఆలయానికి ప్రవేశించుట, 27న ఉదయం నుంచి చక్కెరతీర్థం(జాతర), నాకబలి, పూర్ణాహుతి వివిధ కార్యక్రమాలు జరుగును.

వాగులను తోడేస్తున్నారు.!

(ఐదో పేజీ తరువాయి)

పంటలు దెబ్బతింటున్నాయి. ఇసుక తవ్వకాలు పెద్ద ఎత్తున చేయడం వల్ల భూగర్భ జలాలు తగ్గిపోవడంతో ఆ ప్రభావం బోర్లపైన పడుతుంది. వాగుల వెంట ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వవద్దని భూగర్భ జలవనరుల శాఖతోపాటు కేంద్ర హైడ్రాలోజీ శాఖ గతంలోనే సూచనలు చేసిన పట్టించుకోలేదు. జిల్లా పరిధిలోని మంజీరాతో పాటు పెద్దవాగు, కప్పలవాగు పరిధిలో చెక్‌డ్యామ్‌లు,ఎత్తిపోతలపథకాలు ఉండటంతో ఈ ఇసుక తరలింపు వల్ల దెబ్బతింటున్నాయని, తవ్వకాలు చేపట్టవద్దని జిల్లా అధికారు లకు సూచించారు.అయినా పట్టింట్టించుకోకపోవడంతో ప్రతీ ఏడాది ఇసుక తోడేస్తుండటంతో ఆప్రభావం భూగర్భ జలాలపై పడి బోర్లు ఎత్తిపో తు న్నాయి. దీనివల్ల రైతులు కొత్త బోర్లు వేయడంతో అదనంగా భారం పడు తోంది. ప్రతీరోజు తమ కళ్ల ముందే వాహనాల ద్వారా ఇసుక తరలింపు కొన సాగుతున్నా అధికారులుమాత్రం పట్టించుకోవడం లేదు.కార్యాలయాల ముం దు నుంచే వాహనాలు వెళ్తుండటంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ,మైనింగ్,పోలీస్‌శాఖ అధికారులుఅన్ని మండలాలపరిధిలో సమ న్వయంతో పనిచేస్తే ఇసుక తవ్వకాలు ఆగే అవకాశం ఉంది. రాజ కీయ ఒత్తిళ్ల నేపథ్యంలో గతంలోఅధికారులు మాత్రం పూర్తిస్థాయిలో స్పందించడం లేదు.

అభివృద్ధి జరగాలంటే
తెలంగాణలో మార్పు రావాలి

(ఐదో పేజీ తరువాయి)

చేశాయని, ప్రస్తుతం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీలకు తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో విద్యారం గాన్ని అభివృద్ధి చేసేందుకు పెద్దఎత్తున ఉపాధ్యాయుల భర్తీ జరిగిందని, ప్రజలు, యువకులను చైతన్యవంతులను చేయడంలో ఉపాధ్యాయులు తమదైన ముద్ర వేశారని గుర్తుచేశారు. వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు శాసనమండలిలో ప్రాతినిధ్యం కల్పించినట్లు చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయులను అణచివేసిందని, మండలిలో ప్రాతినిధ్యం లేకుండా కుటీల ప్రయత్నం చేసిందని ఆరోపించారు. బంగారు తెలంగాణ పేరుతో కేసీఆర్ తన కుటుంబాన్ని బంగారు కుటుంబంగా మార్చుకున్నారని ఎద్దేవాచేశారు. ఏడాది క్రితం కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు అన్నివిధాల అండగా ఉంటామని ఆరు హామీలు ఇచ్చి పూర్తిగా విఫలమైందన్నారు. రియల్ ఏస్టేట్ రంగం పూర్తిగా కుప్ప కూలడానికి ప్రభుత్వ నిర్ణయాలే కారణమని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్లలలో ప్రజల్లో వ్యతిరేకతను మూట కట్టుకుంటే కాంగ్రెస్ పార్టీ ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకతను మూట క ట్టుకుందన్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పడంతోపాటు ఉద్యోగాల నోటిఫికేషన్, ఐదు లక్షలతో కూడిన విద్య భరోసా కార్డులను అందిస్తామని చెప్పిన ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీని గెలిపించాలని కోరారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. రాష్ట్రంలోనూ అభివృద్ధి కొనసాగాలంటే ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పట్టభద్రుల ఎన్నికలలో అంజిరెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో కొమురయ్యలను మొదటి ప్రాధాన్యతతో ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్‌కుల చారి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, జాతీ య పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు నర్సింహరెడ్డి, రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రాంచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయం

సుభాష్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లోని మిర్చీ కంపౌండ్‌లో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో శనివారం ఆయన ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. గ్యారెంటీలు, డిక్లరేషన్ల మీద తెలంగాణ సమాజాన్ని సీఎం మోసం చేశారని కేంద్ర మంత్రి విమర్శించారు. ఈ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్‌లు, ఉపాధ్యాయులు కీలక నిర్ణయం తీసుకోవాలన్నారు. పనిచేసే బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, పసుపుబోర్డు ఏర్పాటు, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరణ, సమ్మక్క సారలమ్మ, యూనివర్సిటీ ఏర్పాటు కేంద్రమే ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. నిరుద్యోగుల పక్షాన గొంతెత్తుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు

నిజామాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల సమ యంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన వాటిల్లో ఏ హామీనీ నెరవేర్చలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపిం చారు. నిజామాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మా ట్లాడారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు కల్పి స్తామని హామీఇచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ కోచింగ్ సెంటర్ల వద్దకు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి వచ్చారని, అక్కడి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలు ఇచ్చినా ఇప్పటివరకు కొత్త నోటిఫికేషన్ ఏవీ ఇవ్వలేదన్నారు. సంవత్సరంలోపు భర్తీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేత సోనియా గాంధీల ఫొటోలు పెట్టి ప్రచారం చేసినా పోస్టులు మాత్రం భర్తీ చేయలేదన్నారు. వీటిపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన సవాళ్లకే పరిమితమైందని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగులు అన్ని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. బీజేపీ ముగ్గురు అభ్యర్థులను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామ న్నారు.నిరుద్యోగులతోపాటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరి స్తామ న్నారు. కాంగ్రెస్‌తో కలిసేందుకే బీఆర్ఎస్ నేతలు ప్రయత్నాలు చేస్తోందని కేంద్ర మంత్రి అన్నారు. గతంలో అనేకసార్లు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌కు మద్దతిచ్చారని అన్నారు. కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేరిస్తేనే వ్యతిరేకిస్తామన్నారు. బీసీ రిజర్వేషన్ పెంపును స్వాగతిస్తున్నామని అన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3 సీట్లలోనూ విజయం బీజేపీ అభ్యర్థులే సాధిస్తారని అన్నారు. పసుపు రైతులు కూడా బీజేపీ అభ్యర్థులకే మద్దతు పలుకుతారని కోరారు. సమావేశంలో శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, మాజీ ఎమ్మెల్యే రాం చంద్రరెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీ మేరకు
పసుపునకు మద్దతు ధర ఇవ్వాలి

(ఐదో పేజీ తరువాయి)

ఆమె ప్రకటించారు. బనకచెర్ల ప్రాజెక్టును ఆపాలి

ప్రజాభవన్‌లో ఇరురాష్ట్రాల సీఎంల సమావేశం తర్వాత బనకచెర్ల ప్రాజెక్టు చేపడుతామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారని కవిత ఆరోపించారు. చంద్రబాబు నాయుడుకు సీఎం రేవంత్‌రెడ్డి బ్రీఫ్ చేసిన తర్వాతే ఈ ప్రకటన చేశారని అన్నారు. గోదావరి నది నుంచి 200 టీఎంసీల నీళ్లను కృష్ణా, పెన్నా నదుల పరివాహక ప్రాంతానికి తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపడుతోందని, మన నుంచి ఏపీ ప్రభుత్వం 200 టీఎంసీల నీళ్లను తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలను చేపట్టడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల హితం కోరితే ఈ ప్రతిపాదనలు వ్యతిరేకిస్తూ కేంద్రానికి లేఖలు ఎందుకు రాయడం లేదని ఆమె ప్రశ్నించారు. బనకచెర్ల ప్రాజెక్టు ప్రతిపాదనలు ఆపాలని డిమాండ్‌చేశారు. గోదావరి జలాలను గురుదక్షిణగా చంద్రబాబుకు సీఎం రేవంత్‌రెడ్డి సమ్మతిస్తున్నారని ఆమె ఆరోపించారు.

రేవంత్ తీరు మార్చుకో..

తన గురించి మాట్లాడవద్దని సుప్రీం కోర్టు ఇదివరకే మొట్టికాయలు వేసినా సీఎం రేవంత్‌రెడ్డి తీరు మారలేదని ఆమె విమర్శించారు. దేశంలో సుప్రీం కోర్టు తిట్టిన మొదటి సీఎం రేవంత్‌రెడ్డి అని అన్నారు. ఆయనలా మాట్లాడి తన స్థాయిని తగ్గించుకోదలచుకోలేనని ఆమె అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పైకప్పు కూలి కూలీలు గాయపడటం అత్యంత దురదృష్టకరమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకోవా లన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులో పసుపు పరిశీలించిన సమయంలో ఆమె వెంట మాజీ మేయర్ నీతూకిరణ్, పార్టీ నేతలు ఎస్‌కే అలీమ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత రాంకిషన్‌రావు, ఇతర నేతలు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యారంగ వ్యతిరేక విధానాలపై పోరాటాలు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యారంగ వ్యతిరేక విధానాలపై ఏబీవీఎస్‌యూ సమరశీల పోరాటం చేస్తుందని ఏబీవీఎస్‌యూ జాతీయ కార్యదర్శి షఫీ ఉల్లా అన్నారు. శనివారం నిజామాబాద్‌లో ప్రారంభమైన ఏబీవీఎస్‌యూ రాష్ట్ర మహాసభల మొదటి రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేసేందుకు నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకొస్తుందని ప్రభుత్వ విద్య బలోపేతం కావాలంటే బడ్జెట్ పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విద్యార్థులకు సరైన సమయంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని అలా విడుదల చేయకపోవడంతో విద్యార్థులు చదువును మధ్యలోనే మానేస్తున్నారని అన్నారు. మూడు రోజుల పాటు జరుగనున్న మహాసభల్లో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బోడ అనిల్, మన్నే కుమార్, ఆర్ఎస్‌పీ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిబాబా, శివాజీ, ప్రభాకర్, విజయలక్ష్మి, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఏబీవీఎస్‌యూ మహాసభలో నేతల అభివాదం

'మందకృష్ణ మాదిగకు భయపడే సీఎం మాలలను అణచివేస్తున్నారు'

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):మాలల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం మాలలను అణచివేస్తూ వారి ఉనికిని దెబ్బతీస్తున్నారని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. శనివారం నగరంలో ఉమ్మడి జిల్లాల మాలమహానాడు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మందకృష్ణ మాదిగ బెదిరింపులకు సీఎం రేవంత్‌రెడ్డి భయపడి మాలలను దెబ్బతీస్తున్నాడని అన్నారు. అందుకే కమీషన్ పేరుతో జస్టిస్ షమీమ్ అక్తర్‌తో తప్పుల తడక రిపోర్ట్‌ను రూపొందించారని ఆయన అన్నారు. కమీషన్ రిపోర్ట్ ఎందుకు బయటపెట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. మాల ఉపకులాల మధ్య మందకృష్ణ మాదిగ చిచ్చుపెట్టి మాలలపై విషం కక్కుతున్నారని ఆయన తన పద్దతిని మార్చుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతతకు ప్రయత్నిస్తే మాలల ఆగ్రహానికి కాంగ్రెస్ పార్టీ గురికావాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో కిరణ్, చంద్రకాంత్, గంగారాం, నారాయణ, ఎబ్నైజర్, తదితరులు పాల్గొన్నారు.

● జాతీయ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శిగా పులి జైపాల్

జాతీయ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శిగా నగరానికి చెందిన డాక్టర్ పులిజైపాల్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశాలు ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన పులి జైపాల్ జాతీయ మాలమహానాడు అభివృద్ధికి కృషి చేశారని ఆయన అభినందించారు.

యూరియా కోసం ఆందోళన చెందవద్దు

● అవసరం ఉన్న రైతులకు సరఫరా చేస్తున్నాం:జేడీఏ

నిజామాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):జిల్లాలో యూరియా కొరతలేదని అవసరమున్న రైతులందరికి అంది స్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. జిల్లాలోని బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ నియోజకవర్గాల పరిధిలోని వారికి మూడు విడతల్లో యూరియా అందజేవిధంగా సరఫరా చేశామన్నారు. బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో ఆలస్యంగా వరి వేయడం వల్ల 2,3వ విడత కోసం యూరియా సరఫరా చేస్తున్నామన్నారు. ఏ గ్రామం పరిధిలో రైతులకు అవసరం ఉన్నా సమాచారం తెలియగానే అక్కడి సొసైటీ ద్వారా అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దన్నారు. పంట అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వానికి నివేదించి యూరియాను సరఫరా చేస్తున్నామన్నారు.ఎక్కువమోతాదులో యూరియాను వాడవద్దని అది దిగుబడిపై ప్రభావం చూపిస్తుందని ఆయన తెలి పారు. జిల్లాలో ఈయాసంగిలో రూ.4లక్షల 19వేల ఎకరాలవరకు వరి సాగైందని తెలిపారు. ఎక్కడ అవసరం ఉన్నా ఆయా మండలాల పరి దిలోని వ్యవసాయశాఖ అధికారులకుసమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

గురుద్వారాలో గురుగ్రంథీ పఠనం

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):లోక కళ్యాణం కోరు కుంటూ జిల్లా కేంద్రంలోని గురుద్వారాలో శనివారం గురుగ్రంధీలను పఠనం చేశారు. ప్రపంచ శాంతి కోరుకుంటూ బహదూర్ సాహెబ్, ధన్ ధన్ సాహెబ్‌ల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శ్రీ దాసం గ్రంత్ సాహెబ్ జీ మహారాజ్ ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు నిర్వహించారు. గురుగ్రంధీ పఠనంతో పాటు భజనలు, కీర్తనలు పాడారు. ఈ కార్యక్రమంలో గురుద్వారా ప్రబంధ కమిటీ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గురుద్వారా ప్రబంధ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని వర్నిరోడ్‌లోగల గురుద్వారా ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త
సైనికుడిలా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌రాజ్

ధర్పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):ఈనెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ప్రతిపాదించిన అభ్యర్థిని గెలిపించాలని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోగల పార్టీ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై దిశనిర్దేశం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతుందన్నారు. యువత కోసం ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం మెరుగుపర్చిందని యువత, విద్యావంతులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, ధర్పల్లి సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున్, మాజీ సర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, చెలిమెల శ్రీనివాస్, సుభాష్, అబ్దుల్ హమీద్, సురేందర్‌గౌడ్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

44వ జాతీయ రహదారిపై ట్యాంకర్ బోల్తా

● హైదరాబాద్ నుంచి నాగపూర్‌కు తరలిస్తూ అమోనియా యాసిడ్ ట్యాంకర్ డిచ్‌పల్లి వద్ద బోల్తా
● వాహనాలను దారిమళ్లించిన పోలీసులు ● ఘాటు వాసన తో ఇబ్బందులు పడ్డ స్థానికులు



డిచ్‌పల్లి వద్ద బోల్తాపడిన అమోనియా యాసిడ్ ట్యాంకర్



పోలీసుల భద్రత ఏర్పాట్లు

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):44వ జాతీయ రహదారి డిచ్‌పల్లి నాగపూర్ గేటువద్ద హైదరాబాద్ నుంచి నాగపూర్ అమోనియా యాసిడ్ తరలిస్తున్న లారీట్యాంకర్ అదుపుతప్పి శనివారం బోల్తా పడింది. నడి రోడ్డుపై ట్యాంకర్ బోల్తా పడటంతో వాహనాలు నిలిచిపోయాయి. యాసిడ్‌రోడ్డుపై ప్రవహించడంతో చుట్టూ పక్కల స్థానికులు, వాహనదారులు ఘాటైన వాసనతో గాలి తీసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకొని ట్రాఫిక్ ను దారి మళ్లించారు. సాయంత్రం భారీ క్రేన్ సహాయంతో బోల్తా పడిన ట్యాంకర్‌ను రోడ్డుపై నుంచి పక్కకు తొలగించారు. ఈ ప్రమా దంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితడిని 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో పోలీసులు తెలిపారు.

టీయూ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రవీణ్ నియామకం



టీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రవీణ్‌కు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బయోటెక్నాలజీ విభాగానికి చెందిన డా.ప్రవీణ్ మామిడాలను నియామిస్తూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.యాదగిరి రావు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతోనియామక పత్రాన్ని శనివారం రిజిస్ట్రార్ యాదగిరి ప్రవీణ్‌కు అందజేశారు. ప్రస్తుతం వర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో ప్రవీణ్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో బయోటెక్నాలజీ విభాగాధిపతిగా, పాఠ్యప్రణాళిక సంఘం చైర్మన్, పరీక్షల నియంత్రణాధికారిగా ఫారెన్‌రిలేషన్స్, ఐక్యూఏసీ, యూజీసీ విభాగాలకు డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. తెలంగాణ రాష్ట్ర సోషల్ విభాగంలో జాయింట్ సెక్రటరీగా విధులు నిర్వర్తించి ప్రవీణ్ ఉన్నతాధికారుల అభినందనలు పొందారు. ఉన్నత విద్య అనంతరం పరిశోధనలకోసం చైనా, సౌత్ ఆఫ్రిక, అమెరికా, దేశాలను సందర్శించారు. ఈసందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో నియామక ఉత్తర్వులు అందజేసిన వీసీ రిజిస్ట్రార్‌లకు ధన్యవాదలు తెలిపారు.

● పరీక్షల నియంత్రణాధికారిగా ప్రొ.సంపత్ కుమార్ నియామకం

తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా ప్రొ.సంపత్‌కుమార్ ను నియామిస్తు వైస్ చాన్సలర్ యాదగిరి రావు నియామిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శనివారం సంపత్ కు రిజిస్ట్రార్ యాదగిరి నియామక పత్రం అందజేశారు. సంపత్ కుమార్ ప్రస్తుతం స్టాటటిక్స్ విభాగంలో ఆచార్యులు గా కొనసాగుతున్నారు. ప్రస్తుతం వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో అప్లైడ్ స్టాటటిక్స్ హెడ్‌గా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ గా, పీఆర్‌వో , నోడల్ ఆఫీసర్, వైస్ ప్రిన్సిపాల్, పబ్లికేషన్ డైరెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ.. నియామక ఉత్తర్వులు అందజేసిన వీసీ, రిజిస్ట్రార్ లకు ప్రత్యేక ధన్యవాదలు అని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఐడీసీఎంఎస్ చైర్మన్



ముఖ్యమంత్రిని సన్మానిస్తున్న ఐడీసీఎంఎస్ చైర్మన్

ఖిల్లా,ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి):తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని శనివారం ఉదయం ఆయన నివాసంలోఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయనను కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా రైతులకు సొసైటీల ద్వారా అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ అధ్యక్షుడు కేతావత్‌యాదగిరినాయక్, నిజామాబాద్ జిల్లా ఏబీఎస్ఎస్ అధ్యక్షుడు భూక్యాచంద్రునాయక్‌లు ఉన్నారు.

ఎస్సీ హాస్టల్ ఆకస్మిక తనిఖీ

● హాస్టల్‌లో విద్యార్థులతోనే బస చేసిన అదనపు కలెక్టర్



విద్యార్థులతో కలిసి హాస్టల్‌లో బస చేసిన అదనపు కలెక్టర్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లిలో గల బాలుర ఎస్సీవసతి గృహన్ని గత రాత్రి అడిషనల్ కలెక్టర్ అం కిత్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి అక్కడే నిద్రించారు. శనివారం ఉదయం హాస్టల్ లోని భోజన వివ రాలు, మెనూ వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఉద యం అందజేసిన అల్పాహారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల గదికి సమీపంలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని ఎంపీడీవో ను ఆదే శించారు.

విజయ్ హైస్కూల్‌లో ఘనంగా కవలల దినోత్సవం



కవలల దినోత్సవంలో పాల్గొన్న కవలలు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని నగరంలోని విజయ్ హైస్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని శిశు తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న 25 మంది జంట కవలలకు తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. కవలలను పెంచడంలో ఒక తల్లిపడే ఆనందం మరియు ఆవేదనను మాటలు, పాటలు, నృత్య రూపకంలో వివరిస్తూ అలరించారు. ఒకే వేదికపై 25 కవల జంటలు కనిపించడం కనువిందుగా అనిపించింది. ఈ సందర్భంగా కవలలను పాఠశాల వ్యవస్థాపకురాలు అమృతలత ఆశీర్వదించారు.

సెల్‌ఫోన్‌ల అప్పగింత



సెల్‌ఫోన్‌లను అప్పగిస్తున్న దృశ్యం

ఖిల్లా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):వివిధ కారణాలతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను పోలీసులు రికవరీ చేసి వారికి అందించారు. నిజామబాద్ నగరంలోని 1వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 18 సెల్‌ఫో న్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి తెలిపారు. పోయినసెల్‌ఫోన్‌ల విష యమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయ డంతో వారి ఫిర్యాదును స్వీకరించి పోగొట్టుకు న్న వారికి తమసెల్‌ఫోన్‌లను తిరిగి అందజేశారు.

యువతిపై సామూహిక అత్యాచార యత్నం?

ధర్పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్ట అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి యువతిపై సామూహిక అత్యాచార యత్నానికి పాల్పడినట్లు తెలిసింది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన సమాచారం మేరకు నలుగురు వ్యక్తులు ఇద్దరు యువతులను రాత్రి సమయంలో వాహనంలో నల్లగుట్ట అటవీ ప్రాంతానికి తీసుకెళ్లగా అందులో నుంచి ఓయువతి తప్పించుకొని మండలంలోని ఓగ్రామానికి వచ్చినట్లు తెలిసింది. తప్పించుకున్న యువతి విషయాన్ని గ్రామస్తులకు వివరించగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.ఇద్దరు యువతులను 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై స్థానిక పోలీసులకు వివరణ కోరగా స్పందించలేదు.